



కొమరాడ మండలం కూనేరు-రామభద్రపురం రహదారి పరిస్థితి ఇది..

వెళ్లలేం.. రాలేం



ఉల్లిభద్ర ప్రాంతంలో ప్రధాన రహదారి ఇలా..

- గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. రోడ్లు అధ్వానం
- భారీ వర్షాలకు మరింత ఛిద్రం
- గోతుల్లో నీరు.. రాకపోకలకు తప్పని అవస్థలు
- ప్రయాణం ప్రమాదకరం ● నూతన ప్రభుత్వంపైనే ఆశలు



సాలూరు-మక్కువ రోడ్డు ఇలా..

పార్వతీపురం, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి)/గరుగుబిల్లి: జిల్లాలోని ప్రధాన రహదారులు మరింత అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా పాడయ్యాయి. దారిపొడవునా ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఎంతో మంది మృతి చెందగా.. మరెంతోమంది క్షతగాత్రులుగా మారారు. తరచూ వాహనాలు సైతం గోతుల్లో దిగబడి.. బురదలో కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో ప్రయాణికులు రహదారులపై గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడిక్కడ రోడ్లు ఛిద్రమవగా.. జిల్లా పరిధిలోని అంతర్రాష్ట్ర రహదారులు సైతం భారీ గోతులతో భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కనీసం వాటి మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయలేదు. ఐదేళ్లూ.. రహదారుల నిర్వహణను గాలికొదిలేసింది. జిల్లాలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. రాళ్లు తేలి.. అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా మారాయి. పట్టుకుని కిలోమీటరు కూడా సాఫీగా ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది.



పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద రోడ్డు ఇలా..

వివిధ చోట్ల ఇలా..

పార్వతీపురం మండలం అడ్డాపుశీల, వెంకంపేట గోలీల నుంచి చిన్న బండపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా తయారయ్యాయి. గరుగుబిల్లి మండలం తోటపల్లి ప్రాజెక్టు వద్ద, కురుపాం నుంచి పార్వతీపురం, పాలకొండకు వెళ్లే రోడ్లు భారీ గోతులతో నిండాయి. కొమరాడ మండల పరిధి అంతర్రాష్ట్ర రహదారిలో అయితే రాకపోకలు సాగించడం కష్టసాధ్యంగా మారింది. ఎప్పుడు ఏ గోతిలో ఏ వాహనం దిగబడుతుందో.. ట్రాఫిక్ ఎప్పుడు క్లియర్ అవుతుందో తెలియని పరిస్థితి. పార్వతీపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రధాన మార్గం అత్యంత ప్రమాదకరంగా మారింది. పార్వతీపురం సమీపంలోని కొత్తవలస నుంచి సంతోషపురం, ఖడ్గవలస వరకు ఉన్న 10 కిలో మీటర్ల రహదారిలో భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. వాటిల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు రోడ్డు పక్కన కాసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఆదమరిస్తే మాత్రం ఆసుపత్రికి చేరాల్సిందే.. ఇప్పటికే ఈ మార్గంలో అధికంగా వాహనాలు మరమ్మతులకు గురవుతుండగా.. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని 'మన్యం'వాసులు కోరుతున్నారు.

ఆట స్థలాలకు యోగం

● దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం

మెంటాడ, సెప్టెంబరు 11: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆట స్థలాలు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు ఆట స్థలాలు లేని పాఠశాలల వివరాలు జిల్లాల వారీగా సిద్ధం చేసి నివేదిక పంపాలని ఆర్‌జేడీలు, డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.విజయ రామరాజు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఢిల్లీకి చెందిన అర్జన్‌ముఖర్జీసహా అనే విద్యార్థి మానసిక, శారీరక ఉల్లాసానికి అన్ని పాఠశాలల్లో ఆట స్థలాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం అన్ని రాష్ట్రాలకు సూచనలు ఇచ్చింది. ఈక్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆట స్థలాలపై దృష్టిసారించింది. రాష్ట్రవ్యాప్తంగా 58,950 పాఠశాలలు ఉండగా, వాటిలో 54,891 పాఠశాలల్లో ఆటస్థలాలు ఉన్నట్టు, మిగిలిన 4059 స్కూళ్లలో ఈ సౌకర్యం లేనట్టు ప్రభుత్వ గణంకాలు చెబుతున్నాయి. అయితే జిల్లాల వారీగా లెక్కపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌జేడీలు, డీఈవోలకు తాజాగా ఆదేశాలు అందాయి. ఈ మేరకు మండలాల్లో కసరత్తు మొదలైంది. ముందుగా ప్రభుత్వ పాఠశాలల వారీగా వివరాలు సేకరించి, తర్వాత ప్రైవేటు స్కూళ్లపై నివేదిక రూపొందించాలనుకుంటున్నారు.

ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం పెంచాలి

● వైద్యాధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలందించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖపై సమీక్షించారు. ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆరో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న వారికి వారం రోజుల్లో ఎనీమియా పరీక్షలు చేయాలని, గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెలు, పట్టణాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డీఈవో జి.పగడాలమ్మ, డీఎల్‌ఏటీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

వీడీవీకేల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం

వన్‌దన్ వికాస్ కేంద్రాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు కావాల్సిన వస్తువులను వీడీవీకే, స్వయం సహాయ సంఘాల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం వైటీసీలో 30 మందికి కుట్టుమిషన్లు అందించాలని, బ్యూటీషియన్ కోర్సు శిక్షణ కోసం ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి దినేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవో 115 రద్దు చేయాల్సిందే..

● స్టాఫ్ నర్సుల డిమాండ్ ● జిల్లాకేంద్రాసుపత్రి వద్ద నిరసన



జిల్లా కేంద్రాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

పార్వతీపురం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి)/బెలగాం : తమకు నష్టం కలిగించే జీవో 115ను తక్షణమే రద్దు చేయాలని స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో నిరసన తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 27 మందిని క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యు లర్ చేయకుండా సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించాలని ప్రయత్నించడం తగదన్నారు. మూడున్నరేళ్ల జీఎన్‌ఎం, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ప్రభుత్వాసుపత్రుల్లో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న తమను న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం వారు జిల్లా కేంద్రాసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. తమను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. స్టాఫ్ నర్సుల సంఘం ప్రతినిధులు స్వాతి, సాయికుమారి, పద్మజ, కన్నమ్మ తదితరులున్నారు.



గొరడ గ్రామంలో సంత షెడ్లు ఇలా...

అలానే వదిలేశారు

● నిరుపయోగంగా సంత షెడ్లు

● దృష్టిసారించని అధికారులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల సౌకర్యార్థం వారపు సంతల్లో ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రుపాయలతో వాటిని నిర్మించగా.. నేడు అవి పిచ్చిమొక్కలతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గిరిజనులు, వ్యాపారులకు అవగాహన కల్పించి .. షెడ్లను వినియోగంలోకి తేవాల్సిన అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుమ్మలక్ష్మీపురం, గొరడ, మండెంఖల్ వారపు సంతల్లో అప్పట్లో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా సుమారు రూ.30 లక్షలతో మూడు షెడ్లు నిర్మించారు. వాటిల్లో షాపులు ఏర్పాటు చేశారు. సంతకు వచ్చే గిరిజనులు, చిరు వర్తకులు ఎండ, వానకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాటిని ఏర్పాటు చేసినా.. అధికారుల తీరుతో లక్ష్యం నీరుగారుతోంది. అవగాహన లేక చాలామంది వ్యాపారులు ఈ షెడ్లను వాడుకోవడం లేదు. గిరిజనులు కూడా అక్కడికి వెళ్లడం లేదు. దీంతో లక్షలాది రుపాయలతో నిర్మించిన షెడ్లు వృథాగా మారాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు కోరుతున్నారు.

నైవేద్యం సమర్పయామి

● గణనాథుడికి

108 రకాల ప్రసాదాలు

పాలకొండ: పాలకొండ పట్టణం టీచర్స్ కాలనీలోని రెండో వీధిలో కొలువుదీరిన గణనాథుడికి బుధవారం భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంజనేయనగర్, సత్యసాయినగర్, నీలమ్మకాలనీ, టీచర్స్‌కాలనీ, డిగ్రీ కాలేజ్ రోడ్డులో ఉన్న వారంతా మిఠాయిలు, ఉండ్రాళ్లు తదితర వాటిని స్వామికి ప్రసాదంగా పెట్టారు. 108 మంది దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా 108 రకాల ప్రసాదాలను చూసేందుకు పట్టణవాసులు భారీగా తరలివచ్చారు.





దిబ్బగూడలో సక్కర్స్ పంపిణీ చేస్తున్న అధికారులు



ఆదరాబాదరాగా ఎందుకో?

- మారిషస్ పైనాపిల్ సక్కర్స్ పంపిణీలో అధికారుల అత్యుత్సాహం
- ముందస్తు సరఫరాపై అనేక సందేహాలు ● ప్రోటోకాల్ సైతం పాటించని వైనం

సీతంపేట రూరల్: మారిషస్ పైనాపిల్ మొక్కల పంపిణీ విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రోటోకాల్ సైతం పాటించకుండా.. ఆదరాబాదరాగా గిరిజన రైతులకు సక్కర్స్‌ను అందించారు. వాస్తవంగా సీతంపేట, భామిని మండలాల పరిధిలో సుమారు 90 ఎకరాల్లో కేరళ రకానికి చెందిన మారిషస్ పైనాపిల్ మొక్కలను ప్రయోగాత్మకంగా పెంచాలని ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ నెల 20న సబ్సిడీపై వాటిని సరఫరా చేయాలని భావించారు. అయితే బుధవారం దిబ్బగూడ, కీసర జోడు పంచాయతీల పరిధిలో గిరిజన రైతులకు సబ్సిడీపై పైనాపిల్ సక్కర్స్‌ను పంపిణీ చేపట్టారు. మిగతా పంచాయతీలకు వాహనాల ద్వారా వాటిని సరఫరా చేశారు. అయితే ముందస్తుగా ఎందుకు పంపిణీ చేపట్టారనే దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంత తొందరెందుకు..

పైనాపిల్ సక్కర్స్ సరఫరాకు సంబంధించి ధర విషయంలో అధికారులు సొంత నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. టెండర్లలో తక్కువ ధరకు కోడ్ చేసిన వారిని కాదని టెండర్‌దారులందరూ సక్కర్స్ పంపిణీకి అనుమతులు ఇవ్వడం కూడా వివాదాస్పదమైంది. రూ.15లకు మొక్కల పంపిణీ చేసేందుకు ముందుకొచ్చిన వారిని తిరస్కరించి.. అధికారులే రూ.19 ధరను ఖరారు చేశారు. కాగా టెండర్‌దారులందరికీ 7.20 లక్షల పైనాపిల్ సక్కర్స్ పంపిణీకి అనుమతులు ఇచ్చారు. కాగా ఈ నెల 20న వాటిని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై అందించేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం 60 వేల పైనాపిల్ సక్కర్స్ పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనల ప్రకారం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రూ.10 లక్షలు దాటిన ఏ టెండర్‌కు అయినా కలెక్టర్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అయితే 7.20 లక్షల పైనాపిల్ సక్కర్స్ పంపిణీ టెండర్ ధర రూ.కోటి 40లక్షలు అయినప్పటికీ కలెక్టర్ అనుమతులు లేకుండానే టెండర్ ప్రక్రియ నిర్వహించినట్లు సమాచారం. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవగా.. సంబంధిత ఐటీడీఏ అధికారులు ఆదరాబాదరాగా పైనాపిల్ సక్కర్స్ పంపిణీ చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ప్రోటోకాల్ ఉల్లంఘన...

సంక్షేమ పథకాల కార్యక్రమాలను ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంది. అయితే గిరిజన రైతులకు అందించే పైనాపిల్ సక్కర్స్ విషయంలో మాత్రం ఐటీడీఏ అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు తెలియపర్చకుండానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో అధికారుల తీరుపై స్థానిక ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు.

కలెక్టర్ అనుమతులతోనే...

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అనుమతుల మేరకే గిరిజన రైతులకు 60 వేల పైనాపిల్ సక్కర్స్‌ను పంపిణీ చేశాం. దీనిలో నా ప్రమేయం ఏమీ లేదు.

-వెంకట గణేష్, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి, ఐటీడీఏ, సీతంపేట

విజిలెన్స్ ఎంక్వయిరీ వేయిస్తా...

పైనాపిల్ సక్కర్స్ సరఫరాపై ఫిర్యాదులు అందాయి. నియోజకవర్గంలో గిరిజన రైతులకు వాటిని అందిస్తున్న విషయాన్ని అధికారులు నాకు తెలియజేయలేదు. టెండర్‌లో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేయిస్తాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తాం.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

బైబై గణేశా..

జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీంతో బుధవారం ప్రధాన కూడళ్లన్నీ భక్తులు, గణనాథుడి విగ్రహాలతో కళకళలాడాయి. తొలుత భక్తజనం గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ.. వినాయక నిమజ్జనోత్సవాలకు బయల్దేరారు. యువతతో పాటు చిన్నా, పెద్ద చిందులేసి అందరిలోనూ జోష్ నింపారు. ఈ నిమజ్జనోత్సవంలో బళ్ల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరఘట్టంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, గణనాథులు, బళ్ల వేషాల ఊరేగింపును చూసేందుకు. వంగర, జియ్యమ్మవలస మండలాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. మొత్తంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది.

- వీరఘట్టం



వీరఘట్టం: నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పోరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు

ఆర్తి రవి



తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నో సార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

- అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు
- 2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై... నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

- వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్సన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఛైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్సన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

కోళ్ల నెల జీతం విరాళం



నెల జీతాన్ని విరాళంగా అందించేందుకు సంతకం చేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన నెల జీతాన్ని విరాళంగా ప్రకటించారు. జీతానికి సంబంధించిన పేపర్స్‌ను బుధవారం తన నివాసంలో సంతకాలు చేసి సీఎంవో కార్యాలయానికి పంపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు నెల జీతం విరాళంగా ప్రకటించినట్లు ఆమె తెలిపారు. వరదలకు గురైన విజయవాడ ప్రజలు వేగంగా కోలుకోవాలని ఆమె కోరారు.

దోమల నివారణకు చర్యలు

వేపాడ: మండలంలోని జాకేరు, దబ్బిరాజుపేట గ్రామాల్లో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ మధ్య కాలంలో కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో వాటిని తొలగించడంతో పాటు దోమలు, ఈగలు నివారణకు బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారీ చేయించారు. చెత్తను ట్రాక్టర్ల ద్వారా దూరంగా తరలించారు.

ఎస్.కోటలో దిగ్విజయదివస్

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం దిగ్విజయ దివస్‌ను నిర్వహించారు. స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రపంచ మతాల సమావేశంలో భారత దేశ మత సహనాన్ని చాటి చెప్పిన దినంగా ప్రిన్సిపాల్ కేశవరావు విద్యార్థులకు వివరించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పించారు.

విద్యుత్‌కు అంతరాయం

లక్కవరపుకోట: మండలంలోని కాశాపేట 11కేవీ ఫీడర్‌లో గల తలారీ, కొట్యాడ, రంగారాయపురం, కూర్మవరం, సంతపేట, కాశాపేట గ్రామాలకు ఈ నెల 13న శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎల్‌కోటలో వైద్య శిబిరం

లక్కవరపుకోట: మండల కేంద్రంలో బీసీ కాలనీలో బుధవారం జరిగిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. విశాఖకు చెందిన గాయత్రి విద్యాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి సుమారు వంద మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ అచ్యుతరామయ్య ఆధ్వ ర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మండల కేంద్రంలో ప్రతిరోజు శిబిరం ఉం టుందని, రోగులెవరైనా పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

తోమడపెద్దుకు అంతిమ వీడ్కోలు

లక్కవరపుకోట: మండలంలో మార్లాపల్లి గ్రామంలో తోమడపెద్దు(సింహాద్రప్పన్న ప్రతిరూప ఎద్దు) బుధవారం మరణించింది. సింహాద్రప్పన్నకు ప్రతిరూపంగా ఎద్దును చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూజిస్తున్నారు. ఏటా భోగి రోజు నుంచి ముక్కనుమ వరకూ ప్రతి గ్రామంలో కోలాటాలతో ఊరేగించి పూజలు చేసేవారు. ఎద్దు అకాల మరణం చెందడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపారు. పూలమాల, పసుపు కుంకుమలతో పూజలు చేసి భారీ ఊరేగింపు చేపట్టి ఖననం చేశారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై ప్రత్యేక పూజలు జరిపారు.

పోలిపల్లి హుండీల లెక్కింపు రేపు

రాజాం రూరల్: రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులను ఈనెల 13న తెరిచి లెక్కించనున్నట్లు దేవస్థానం ఈవో బలివాడ మాధవరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. దేవదాయశాఖ తనిఖీదారు సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని ఆయన కోరారు.

13న టెన్నీకాయిట్ ఎంపికలు

విజయనగరం టౌన్: శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఈ నెల 13న ఎంపిక చేయనున్నామని జిల్లా టెన్నీకాయిట్ సంఘ కార్యదర్శి ఎం.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 ఏప్రిల్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. వారి ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా 910 కెఎల్ రిజర్వాయరువద్ద, డాక్టర్ రెడ్డి రవికుమార్ హాస్పటల్ రోడ్డులో, టీటీడీ కల్యాణ మండపం జంక్షన్‌లో పైపులైను లీకేజీలు అరికట్టడం, వాల్వ్‌లను మార్చడం తదితర మరమ్మతు పనులు చేపడుతున్నందున తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు.

షర్మిలతో డీసీసీ అధ్యక్షుడు భేటీ

బొబ్బిలి: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో ఇటీవల నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ బుధవారం భేటీ అయ్యారు. జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై షర్మిల తనకు పలు సూచనలు చేశారని మరిపి తెలిపారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

కొత్తవలస: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తవలసలోని వసంత్ విహార్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లక్ష్మీ గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు అంపోలు ఉమా మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త వల్లూరి జయప్రకాష్ దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

జామి: మండలంలోని లోట్లపల్లి గ్రామాన్ని మంచి నీటి సమస్య పీడిస్తుంది. దీనిపై కొద్దినెలలుగా గ్రామస్థులు పంచాయతీ పాలకులను, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో గ్రామంలోని కొందరు యువకులు బుధవారం గ్రామస్థులకు రక్షితనీటిని స్వయంగా పంపిణీ చేశారు. దాతలు ఆర్మీ శివ, సిడగ వెంకటరావు, నూకరాజు, జన్నెల బాలకృష్ణ, రాధ, సత్యం, కుమార్, ప్రదీప్ తదితరులు రక్షితనీరు రప్పించగా, రవాణాకు బి.రమణ వాహనాన్ని సమకూర్చారు.

గంజాయి నియంత్రణకు నిరంతర తనిఖీలు అవసరం

● ఎస్.కోట స్టేషన్ తనిఖీలో ఎస్పీ వకుల్ జిందాల్

శృంగవరపుకోట: గంజాయి రవాణా నియంత్రణకు నిరంతరం తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శృంగవరపుకోట పోలీస్‌లకు సూచించారు. బుధవారం ఈ ఠాణాను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను చూశారు. పోలీస్ భవనంలోని గదులు, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, ఏ వాహనం ఏ కేసులోనిది తెలిసే విధంగా లేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని, రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. పరారీలో వున్న గంజాయి నిందితులను అరెస్టు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగుతున్నాయి.. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలను సీఐ వి.ఎస్ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సై ఆర్.గోవిందరావు, రూరల్ సీఐ కె.రవికుమార్ తదితరులున్నారు.

జామి: మండల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగ కుండా పోలీసులు దృష్టిసారించాలని, శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని ఎస్పీ వకుల్ జిందాల్ జామి పోలీసులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులు చూశారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, ఎస్ఐ వీరబాబు, సిబ్బంది ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ జిందాల్

గురుదేవ సేవలను మరింత విస్తరించాలి: ఎస్పీ

కొత్తవలస: గురుదేవ చారిటబుల్ ట్రస్టు సేవలను మరింతగా విస్తరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బుధవారం మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. దివ్యాంగుల కోసం ట్రస్టు ద్వారా రాపర్తి జగదీష్ బాబు చేస్తున్న సేవలకు వెలకట్టలేమన్నారు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను తయారు చేయడం కోసం ఇక్కడ పరిశ్రమనే ఏర్పాటు చేయడాన్ని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగుల కోసం కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి నిర్మించడం అభినందనీయమన్నారు. గురుదేవ ట్రస్టు ద్వారా కృత్రిమ అవయవాల తయారీ పరిశ్రమను, గురుదేవ ఆసుపత్రిలోని పలు విభాగాలను, అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి భవనాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన చేతులు మీదుగా 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను, కాలిపర్స్‌ను పంపిణీ చేశారు. 50 మంది అంధులకు పింఛన్‌లను ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, వైద్యులు రాఘవేంద్ర, బీఎన్ రావు, కొత్తవలస సీఐ షణ్ముఖరావు,ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా ఉద్యోగి అదృశ్యం

● విశాఖ ఫార్మాసిటీలో ఘటన

● అడ్మిరాన్ పరిశ్రమ వద్ద కుటుంబీకుల ఆందోళన

పరవాడ, సెప్టెంబరు 11 : విశాఖ ఫార్మా సిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి విధులకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం పరిశ్రమ వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుర్తి గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ(40) అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. భార్య, పిల్లలతో కలిసి గాజువాకలో నివాసముంటూ విధులకు హాజరవుతున్నాడు. మంగళవారం జనరల్ షిఫ్ట్ విధులకు హాజరైన ఇతను సాయంత్రం ఐదు గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి, ఇంటికి బయలుదేరుతున్నట్టు చెప్పాడు. కానీ రాత్రి ఏడు గంటలు దాటినా సూర్యనారాయణ ఇంటికి చేరుకోలేదు. భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఆమె పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు ఫోన్ చేసి వాకబు చేయగా, కంపెనీ నుంచి వెళ్లిపోయారని చెప్పారు. కానీ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సూర్యనారాయణ భార్య, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఫార్మా కంపెనీకి వెళ్లి వాకబు చేశారు. సూర్యనారాయణ విధులకు హాజరైనట్టు సీసీ ఫుటేజీలో కనిపించింది. కానీ డ్యూటీ అనంతరం బయటకు వెళ్లినట్టు ఎక్కడా రికార్డు కాలేదు. ఇతని ద్విచక్ర వాహనం పార్కింగ్ స్థలంలోనే ఉంది. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు... సూర్యనారాయణ ఏమయ్యాడంటూ కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ భార్య బాల మాట్లాడుతూ, డ్యూటీ ముగిసిన తరువాత తన భర్త ఇంటికి రాలేదని, పరిశ్రమలో అడిగితే ఇంటికి వెళ్లిపోయాడని చెబుతున్నారని, లోపల ఏదో ప్రమాదం జరిగి ఉండొచ్చనని, ఆ విషయాన్ని యాజమాన్యం దాచిపెడుతున్నదని ఆరోపించారు. తన భర్తకు ఏదైనా హానీ జరిగితే యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.



సూర్యనారాయణ (ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు.. విచారణ

సూర్యనారాయణ అదృశ్యంపై కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఫార్మా పరిశ్రమకు చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. ఉద్యోగులను విడివిడిగా విచారించారు. సూర్యనారాయణ ఎలా ఉండేవారు, ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా వంటి విషయాల గురించి ప్రశ్నించారు. కాగా సూర్యనారాయణ పరిశ్రమ నుంచి బయటకు వెళ్లినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు కాకపోవడంతో అతను ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయి వుంటాడని యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. కానీ సుమారు ఆరు అడుగుల ఎత్తు వున్న ప్రహరీ గోడను దూకే అవకాశం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్నింగ్స్ ఆధిక్యంలో శ్రీకాకుళం, విశాఖ జట్లు

విజయనగరం టౌన్, ఆగస్టు 11: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణ శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు విజయనగరం జట్టుపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజయం సాధించింది. వర్షం కారణంగా తొలి రోజు ఆట పూర్తిగా రద్దు కాగా, రెండో రోజు ఆటలో విజయనగరం జట్టు 8 వికెట్ల నష్టానికి 398 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మూడో రోజు ఆట ముగిసే నాటికి 8 వికెట్లు నష్టపోయి 401 పరుగులు సాధించింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో శ్రీకాకుళం జట్టుకు 3 పాయింట్లు, విజయనగరం జట్టుకు 1 పాయింటు లభించింది. డెంకాడ మండలం చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో తూర్పుగోదావరి, విశాఖ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టుపై విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 56 పరుగులు ఆధిక్యం పొందడంతో విశాఖ జట్టుకు 3 పాయింట్లు, తూర్పుగోదావరి జట్టుకు 1 పాయింటు లభించింది.



విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్

సీబీఎం పాఠశాల అమ్మకంపై విచారణ చేయాలి



ఎమ్మార్వోకు వినతి పత్రమిస్తున్న సాంబయ్య

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఉన్న సీబీఎం పాఠశాల అమ్మకం/కొను గోలుపై సమగ్ర దర్యాప్తు చెయ్యాలని కోరుతూ అంబేడ్కర్ పోరాట సమితి విజ యనగరం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు సోరు సాంబయ్య బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మా ర్వో శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు 110 సంవత్సరాల చరిత్ర కలిగిన సీబీఎం బాలికల ఉన్న త పాఠశాల స్థలంలో సుమారు 1.20 ఎకరాల భూమిని సీబీఎం ట్రస్ట్ వారు వైఎస్సార్‌సీపీ నాయకులైన తూముల భాస్కర రావుకు అన్యాక్రాంతం చేయ డం, దీనిపై చీపురుపల్లిలో రిజిస్ట్రేషన్ చేయటంలో ఉన్నతాధికారుల హస్తం ఉందన్నారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా రహస్యంగా 100 కోట్లు విలువ చేసే భూములను కోమటిపల్లిలో ఉన్న పనికిరాని విలువలేని భూములతో బద లాయింపు చేసామని, కొనుగోలు చేయలేదని పత్రికా ముఖంగా తూముల భాస్కరరావు చెప్పటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలను కారు చవకగా కొనుగోలు చేయడం, అమ్మడం చాలా నేరమని, దీనిపై కమిటీ వేసి నిజ నిర్ధారణ చేసి, సదరు రిజిస్ట్రేషన్లను రద్దుచేసి తిరిగి పాఠశాలను పునరుద్ధరించాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలిత కుమారి

కొత్తవలస: రాజకీయాలకు అతీతంగా అందరం కలసి పని చేసుకుని మండలంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమెకు పలు ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు తమ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవాలంటే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారుల సహకారం అవసరమన్నారు. పార్టీలను పక్కన బెట్టి రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చెసుకుందామన్నారు. మండలంలో ఎక్కడ విద్యుత్‌కు సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఏఈ అప్పారావుకు సూచించారు. మండలంలో వర్షాలు విస్తారంగా కురిసినందున ఇంకా వరినట్లు వేసుకుని రైతుల వద్దకు వెళ్లి వరిపంట వేసుకోవాలని, అవగాహన కల్పించాలని మండల వ్యవసాయశాఖాధికారి మాధురిశరణ్యకు తెలిపారు. తహసీల్దార్ నీలకంఠరావు, ఎంపీడీవో పద్మజ, వైస్ఎంపీపీ కర్రిశ్రీను తదితరులున్నారు.

సంప్రదాయబద్ధంగా నిమజ్జనోత్సవం

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, సెప్టెంబరు 11: సంప్రదాయబద్ధంగా గణనాథుడి నిమజ్జనోత్సవం జరపాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. బుధవారం తన నివాసంలో వినాయకుల కమిటీ సభ్యులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న తెలుపు వస్త్రాలు ధరించి శాంతియుత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం జరపాలని ఆమె తెలిపారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మతాబు సామాన్లతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని హితవు పలికారు. పట్టణ,రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణలు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో లేనిపోని గొడవలకు వెళ్లరాదని సూచించారు. ఈ సమయంలో కేసులు నమోదైతే బెయిల్ కూడా రాదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తిరుపతిరావు, భీమారావు, చంద్రశేఖర్, అప్పయమ్మ, వైదేహి తదితరులు పాల్గొన్నారు.

30న పెన్షన్ అదాలత్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 : ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో ఈనెల 30న ఉదయం 11 గంటలకు పెన్షన్ (డాక్) అదాలత్ నిర్వహించనున్నట్లు డివిజన్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని బస్ డిపో సమీపంలో ఉన్న పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ కింద అంతస్తులో తపాలా సేవలు, పెన్షన్‌లకు సంబంధించి ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఆర్ఎంఎస్ - వి.విభాగానికి చెందిన మెయిల్స్, స్పీడ్ పోస్ట్ కథనాలు, పార్శిల్స్, మనీ ఆర్డర్‌లకు సంబంధించిన అన్ని సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వి.డివిజన్ పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్ఎంఎస్/పెన్షన్ అదాలత్ అన్న శీర్షికతో ఈనెల 23వ తేదీలోగా ఫిర్యాదులను సూపరింటెండెంట్, ఆర్ఎంఎస్ - వి.డివిజన్, విశాఖపట్నం 530017 అన్న చిరునామాకు పంపించాలన్నారు.

వరదలపై రాజకీయాలు మాట్లాడడం బొత్సకు తగదు

● మంత్రి కొండపల్లి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా ప్రకృతి సహజ వనరులను దోచేసి రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలకు కారుకులైన వారు విజయవాడలో వరదల సందర్భంగా ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్రమంతి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం విజయవాడ నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. అలాంటి నాయకుడిపై, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు విమర్శించడాన్ని చూస్తుంటే, దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దుయ్యబట్టారు. మంగళవారం విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పాత్రికేయుల సమావేశంలో విమర్శలు చేయడం పట్ల మంత్రి కొండపల్లి ఘాటుగా స్పందించారు. గత ఐదేళ్లుగా ఏ వైపరీత్యం వచ్చినా, ప్రభుత్వం స్పందించిన దాఖలాలున్నాయా? అంటూ ప్రశ్నించారు. ప్రజల క్షేమాన్ని, సంక్షేమాన్ని గాలికొదిలేసిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు మానుకుని, సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ప్రజలకన్నా, రాజకీయాలకే వైసీపీ ప్రాధాన్యం ఇస్తున్నదని, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతుంటే, మాజీ సీఎం జగన్ బెంగుళూరులో సేద తీరుతున్నారని ఆరోపించారు.

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి: వరద బాధితులకు దాతలు పెద్దఎత్తున విరాళాలను అందజేస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు. బొబ్బిలి మండలం రంగరా యపురం సర్పంచ్ కునుకు రాధ ప్రతినిధి కునుకు రమణ 20 వేలు, ముత్తాయివలసకు పిల్లా శంకరరావు కుమారుడు చంద్రమౌళి పదివేల రూపాయలను ఎమ్మెల్యే బేబీనాయన ద్వారా సీఎం సహాయనిధికి అందజేశారు. బొబ్బిలి పట్టణ వెలమ వీధికి చెందిన అలజంగి అనంతరావు రూ.10,116, రిటైర్డ్ టీచర్ ఎ.లక్ష్మణరావు రూ.పదివేలు చొప్పున బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు.

సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

వేపాడ: రైతు సాధికార సంస్థ సిబ్బంది, సభల స్వచ్ఛంద సంస్థ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని సోంపురం రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతు సాధికార సంస్థ, సభల సంస్థ సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వేపాడ మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దాలన్నారు. దీనికి కావాల్సిన సహాయ సహకారాలు జిల్లాస్థాయి అధికారులు అందిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఇన్‌ఫుట్స్ ప్రిపరేషన్, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలన్నారు. సభల ప్రాజెక్టు ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నామన్నారు. అరిగిపాలెం గ్రామంలో సామూహికంగా 500 లీటర్లు జిల్లేడు ద్రావణం తయారుచేశారు. సోంపురం గ్రామంలో రైతులకు దశకర్ణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసంత, సభల పీసీ శ్రావణి, వెంకటరావు, రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వసంత గెడ్డలో వ్యక్తి గల్లంతు

● కాజ్‌వేపై వెళ్తూ జారిపడ్డంతో ప్రమాదం



గల్లంతైన సతీష్



గాలింపు చేపడుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

గంట్యాడ/లక్కవరపుకోట: గెడ్డలోకి జారిపడి వ్యక్తి గల్లంతైన ఘటన మండ లంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్.కోట మండలం చందులూరు గ్రామానికి చెందిన బత్తులు సతీష్(38)తన భార్య వరలక్ష్మితో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం మధ్యాహ్నం అత్తవారి గ్రామమైన చంద్రంపేట వెళ్లాడు. అక్కడ పని చూసుకుని తిరిగి చందులూరుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా చంద్రంపేట-వసంత గ్రామాల మధ్య ఉన్న గెడ్డ(కాజువే)పై ప్రయాణం చేస్తుండగా అదుపు తప్పి బైక్ కింద పడింది. బైక్‌పై నుంచి సతీష్ గెడ్డ వాగులోకి జారిపడి కొట్టుపోగా భార్య వాహనాన్ని పట్టుకుని ఉండిపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. వెంటనే గ్రామ రెవెన్యూ కార్యదర్శి ఈ విషయాన్ని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి తెలపడంతో ఆయనతో పాటు ఎస్ఐ సాయి కృష్ణ, ఎంపీడీవో భవాని ఘటాన స్థ లానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఆర్డీవో సూర్యకళ అక్కడకు చేరుకుని, పరిస్థితిని సమీక్షించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను తెప్పించారు. వారు మూడు గంటలు పాటు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇంతలో చీకటిపడటంతో గురువారం ఉదయం మరోసారి గాలిస్తామని తహసీల్దార్ తెలిపారు. గల్లంతైన వ్యక్తికి ఒక కుమార్తె ఉంది.

చెరువులో పడి ఒకరి మృతి

భోగాపురం, సెప్టెంబరు 11: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం భోగాపురం గ్రామం ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన బమ్మిడి కనకరాజు(39) స్థానికంగా ఓ ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తా అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన కనకరాజు మధ్యాహ్నం అయినా ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికి, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇంటి సమీపంలో ఉన్న బుడబంద చెరువు వైపు వెళ్లి పరిశీలించారు. చెరువులో తేలుతున్న కనకరాజు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని బయటకు తీశారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. దీనిపై మృతుడి భార్య బమ్మిడి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.వి. ప్రభాకర్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఏడేళ్ల కుమారుడు, తల్లిదండ్రులు అప్పయ్యమ్మ, గురువులు ఉన్నారు.

51 మందిపై బైండోవర్ కేసులు

సాలూరు: పట్టణంలో 51 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు పట్టణ సీఐ అప్పలనాయుడు బుధవారం తెలిపారు. పట్టణంలో వివిధ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై బైండ్‌ఓవర్ కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. బైండోవర్ ఉత్తర్వులు అతిక్రమిస్తే రెండు లక్షల రూపాయలు జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా పాత కేసుల్లో, గొడవల్లో కారణమైన వారిపై కేసులు పెడుతున్నామని తెలిపారు.

కూలిన రైస్‌మిల్లు గోడ



బొబ్బిలి: బొబ్బిలి పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో గల రైస్‌మిల్లు గోడ బుధవారం మధ్యాహ్నం కూలిపోయింది. అడపా యోగేశ్వరరావుకు చెందిన ఈ మిల్లు గోడ కూలిన ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇటీవల కురి సిన వర్షాలకు గోడ బాగా నానిపోయి ఉంది. ప్రమాద సమయంలో ఎవరూ లేక పోవడం, మిల్లులోపల వైపు కాకుండా బయట వైపు గోడ కూలి పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బొగ్గు లారీ బోల్తా



బోల్తాపడిన బొగ్గు లారీ దృశ్యం

దత్తిరాజేరు: మండలంలో పెదమానాపురం పోలీసుస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బొగ్గులారీ బోల్తాపడి ఘటనలో పెను ప్రమాదం తప్పింది. చత్తీస్‌ఘడ్ నుంచి కంటికాపల్లి వెళ్తున్న బొగ్గు లారీ పెదమానాపురం పోలీసు స్టేషన్‌కు కూతవేట దూరంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బాడంగి: గతంలో ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను బుధవారం ధ్వంసం చేశారు. గతంలో 62 ఎక్సైజ్ కేసుల్లో సుమారు 700లకు పైచిలుక మద్యం బాటిళ్లను విజయనగరం ఏఈఎస్, ఎస్ఈబీ, ఇన్‌చార్జి ఎస్ఐ సాగర్‌బాబు సమక్షంలో ధ్వంసం చేశారు.

విజయనగరం రూరల్ ఎస్ఐగా అశోక్‌కుమార్

విజయనగరం క్రైం: విజయనగరం రూరల్ పీఎస్ ఎస్ఐగా వి.అశోక్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో విజయనగరం రూరల్ ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం

విజయనగరం టౌన్: స్థానిక మహరాజా ఫార్మశీ కళాశాలలో కరెంట్ ట్రెండ్స్ ఇన్ ఫార్మసిటికల్స్ అండ్ ఇన్ సిల్కో అప్లికేషన్స్ అంశంపై మూడు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఐసీఎంఆర్- ఎన్ఐఎన్ శాస్త్రవేత్త, విశ్రాంత డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఎన్. హరిశంకర్ హాజరై ఇన్సిల్కో అప్రోచ్ ఫర్ పీసీఓఎస్ ట్రీట్మెంట్‌పై మాట్లాడారు. అలాగే ఆచార్యులు ఎం.రామయ్య ఇతనో బొటానికల్ మెడిసిన్ రెగ్యులేషన్స్ అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, మాన్సాస్ విద్యా సంస్థల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడిలో స్వల్పంగా వరద తగ్గుముఖం

రేగిడి, సెప్టెంబరు 11: మండలంలో అకులోవకట్టగెడ్డ వరద ఉధృతికి ముంపుకు గురైన రేగిడి గ్రామంతో పాటు అంబాడ, వెంకమ్మపేట, చెలిగానవలస పొలల్లో వరదనీరు బుధవారానికి క్రమేపి తగ్గుముఖం పట్టింది. గత నాల్గురోజులుగా రేగిడిలో ప్రధాన రహదారిమార్గంతో పాటు, ప్రభుత్వకార్యాలయాలు, వెంకమ్మపేట-తునివాడ రహదారి జలదిగ్బంధలో ఉండగా క్రమేపీ నీటి ప్రవాహం జోరు తగ్గింది. దీంతో రేగిడి, వెంకమ్మపేట మార్గాల్లో వరదనీటిలో మనుషులు నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. నాగావళి నీటి ప్రవాహం, అకులోవగెడ్డ ఉధృతి తగ్గటంతో గురువారానికి వరద తగ్గతుందని భావిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి నాయుడు కాలనీలో బుధవారం విశ్రాంత ఉ ద్యోగుల ఆధ్వర్యంలో మాజీ సైనికుడు ఎం లక్ష్మణరావు పర్యవేక్షణలో వినాయక ఉత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సౌజన్యంతో ఉచితంగా సరఫరా చేసిన 10 మొక్కలను నాటారు.

వరద బాధితులకు అండగా నిలవండి

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపు

గరుగుబిల్లి: విజయవాడ వరద బాధితులకు అండగా నిలవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని లఖనాపురంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు అసౌకర్యం కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్‌తో పాటు పలువురు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల నుంచి విరాళాలు సేకరించి ముఖ్యమంత్రికి అందించనున్నట్లు చెప్పారు. అరకు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి ముదిలిబాబు విజయవాంకుశం రూ. 10 వేలు, టి.గంగబాబు రూ. 10 వేలు, గ్రామానికి చెందిన పలువురు రూ. 6,500ను ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.మధుసూదనరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఎం.పురుషోత్తంనాయుడు, రావివలస ఎంపీటీసీ సభ్యులు కె.భరత్‌కుమార్, ఎం.సింహాచలం నాయుడు, డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్ పాల్గొన్నారు.

భోగి-గొటివాడ గెడ్డపై వంతెన నిర్మిస్తాం..

కురుపాం రూరల్: భోగి-గొటివాడ గెడ్డపై వంతెన నిర్మిస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గొటివాడ హామీఇచ్చారు. బుధవారం భోగిగెడ్డ పరిసరాల్లో పర్యటించారు. భోరి-గొటివాడ గ్రామస్థులు శ్రమదానంచేసి కర్రలతో ఏర్పాటుచేసిన బ్రిడ్జిని ఎమ్మెల్యే పరిశీలించారు. భోరి-గొటివాడ గెడ్డపై బ్రిడ్జి నిర్మిస్తే పదుల సంఖ్యలో గ్రామాలకు కనెక్టివిటీ వస్తుందని, గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన పాముల పుష్ప శ్రీవాణి కూడా బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారని, అయితే పనులు ప్రారంభించలేదని స్థానికులు వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు కలిశెట్టి కొండయ్య, మాజీ ఎంపీపీ రమణమూర్తి పాల్గొన్నారు.



గరుగుబిల్లి: లఖనాపురంలో విరాళాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి బురద నీరు

పార్వతీపురంటౌన్: ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి బురదనీరు చేరిందని మునిసిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పార్వతీపురానికి తాగునీటిని సరఫరా చేస్తున్న నాగావళి నదిలో గల ఇన్‌ఫిల్టర్ బావులను ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురవడంతో నాగావళినదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి బురదనీరు చేరిందన్నారు. ఇన్‌ఫిల్టర్ బావుల నుంచి ప్రధాన, బూస్టర్ పంపులకు వచ్చేనీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తామన్నారు.

టీడీపీ నాయకుడు కుటుంబానికి పరామర్శ



మాలతిదొర కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సంధ్యారాణి

పార్వతీపురం రూరల్: ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, వైస్ ఎంపీపీ మాలతిదొర కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం మండలంలోని జోగిధారమెట్టలో మాలతిదొర కుటుంబసభ్యులను పరామర్శించారు. రేషన్‌కార్డు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మాలతిదొర భార్యకు వితంతు పింఛన్, ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు గొట్టాపు వెంకటనాయుడు, శ్రీధర్, గుల్ల వేణుగోపాల్‌నాయుడు, గౌరి, డాక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

●**సాలూరు రూరల్:** విద్యుదాఘాతంతో మృతిచెందిన తీనుసామంతవలసకు చెందిన సీదరపు ఇందిరమ్మ కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భరోసాఇచ్చారు. తీనుసామంతవలసలో బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు కనక, సతీష్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎకో ప్లాంటేషన్ అభివృద్ధి



ఏకో క్లబ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధ్యాపకులు

సీతంపేట: డిగ్రీ కళాశాల ఆవరణలో ఎకో ప్లాంటేషన్ అభివృద్ధి చేయనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. బుధవారం వనమహోత్సవంలో సీతంపేట డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యనందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమారి, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

●డిప్యూటీ డీఈవో సుగుణ

జియ్యమ్మవలస: ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఈవో సీహెచ్ సుగుణ హెచ్చరించారు. వనజ టీడబ్ల్యూఏహెచ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సీమలవానివలస, బొడ్డవలస, గుమ్మిగూడ, వనజ జీపీ స్కూల్స్‌తో పాటు వనజ, జియ్యమ్మవలస జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్స్‌ను పరిశీలించారు.బొడ్డవలస స్కూల్‌లో రికార్డులు సరిగ్గా లేకపోవడం, విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయుడు ఎ.భాస్కరరాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట పీజీడీవో పి.కొండమ్మ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అల్లు రవిప్రసాదరావు ఉన్నారు.



బొడ్డవలస విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న సుగుణ

పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి

సీతానగరం: రైతులకు పెట్టుబడి సాయం కింద రూ20 వేలు ఇవ్వాలని, రైతుల రుణాలను రూ.రెండు లక్షల వరకు మాఫీ చేయాలని, రైతు సంఘ నాయకులు కోరారు. ఈమేరకుబుధవారం మండలంలోని కాశీపేట, పెదభోగిలి సచివాలయాల ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.అనంతరం సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మంనాయుడు, జి.వెంకటరమణ, మీసాల అచ్చుతరావు, మడక ప్రభాకరరావు, శ్రీనివాసరావు, ధనుంజయరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.



సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

జీవో -115 రద్దు చేయాలి



భద్రగిరి ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న నర్సులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి పీహెచ్‌సీల నర్సుల సంఘం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసిన జీవో 115 రద్దు చేయాలని కోరింది. ఈమేరకు ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి నర్సులుగా బాధ్యత అప్పగిస్తామనడం శోచనీయం కాదని పేర్కొని నల్లబ్యాడ్జీలతో నర్సులు నిరసన తెలిపారు.

జోరుగా సుభద్ర యోజనకు దరఖాస్తులు

రాయగడ: సుభద్ర యోజన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. మహిళలు జనసేవాఅంగనవాడీ కేంద్రాల వద్ద బారులుతీరుతున్నారు. 21 నుంచి 60సంవత్సరాల మధ్య వయసు గల మహిళల వార్షిక ఆదాయం 2.5 లక్షల కంటే తక్కువ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది. దీంతో ఈ వివరాలు పర్యవేక్షించే కార్యక్రమం వివిధ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం జిల్లాలో 2,083 అంగన్‌వాడీ కేంద్రాలు, 727 జనసేవా కేంద్రాలు 100 మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు నమోదుచేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



అంగనవాడీ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయగడ: గుడారి పోలీసులు మంగళవారం సాయంత్రం గుమడ మార్కెట్ సమీపంలో పేకాట శిబిరంపై దాడిచేసి 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టుచేశారు. ఈమేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నిందితుల నుంచి రూ.65,474, పది సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

●వ్యవసాయ, కార్మిక, కేవీపీఎస్ సంఘం డిమాండ్



నిరసన తెలుపుతున్న వ్యవసాయ, కార్మిక, కేవీపీఎస్ సంఘం నాయకులు

బెలగాం: శివ్వాం దళితుల భూవివాదంలో కలెక్టర్, బాధితులకు గరుగుబిల్లి తహసీల్దార్ అందించిన నివేదికలో చాలా అవకతవకలు చోటుచేసుకున్నాయని, పెత్తందార్లకు అనుకూలంగా వ్యవహరించడంతో ఆయన్ను సస్పెండ్ చేయాలని వ్యవసాయ, కార్మిక, కేవీపీఎస్, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్ వరకు వ్యవసాయ, కార్మిక, కేవీపీఎస్, రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ శివ్వాం దళితుల భూ వివాదంలో కలెక్టర్‌కు గరుగుబిల్లి తహసీల్దార్ ఇచ్చిన నివేదికలో అవాస్తవాలు ఉన్నాయని, వాస్తవాలు కప్పిపుచ్చి పెత్తందారులకు అనుకూలంగా నివేదిక సమర్పించారని తెలిపారు. దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

వరద ప్రవాహం పెరిగే అవకాశం

● తోటపల్లి ప్రాజెక్టు డీఈ రఘునాథ నాయుడు



దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

గరుగుబిల్లి: వరద ప్రవాహం మరింతగా పెరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉన్నామని తోటపల్లి ప్రాజెక్టు డీఈ టి.రఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు. నదీ తీర ప్రాంతవాసులకు అవసరమైన సూచనలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నది ప్రవాహం నిలకడగానే ఉంది. మంగళవారం పైప్రాంతం నుంచి 10 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం నదిలో చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే నుంచి 10 వేల క్యూసెక్కులకుపైగా దిగువకు విడుదలచేశారు. బుధవారం పైనుంచి ఐదు వేల క్యూసెక్కులకు పైగా ప్రవాహం చేరింది. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.80 మీటర్ల నీటి మట్టం ఉంది. 2.534 టీఎంసీలకు గాను 1.785 టీఎంసీల నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 490 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. పైనుంచి వరద ప్రవాహం కొంతమేర రావడంతో ఏడు వేల క్యూసెక్కులకు పైబడి దిగువకు విడుదల చేస్తున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పాలకొండ: పట్టణంలోని వెంకమ్మపేట ఎంపీయూపీ పాఠశాలలో పాలకొండ ఏరియా ఆసుపత్రి ఆప్తాలమిక్ అధికారి ఎస్.దుర్గారావు ఆధ్వర్యంలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. 15మందికి కంటి లోపాలను గుర్తించామని దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.పరాంకుశంనాయుడు, మల్లేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బుధవారాలు



గరుగుబిల్లిలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: గరుగుబిల్లిలో బుధవారాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా వీధుల్లో మేళతాళాలతో అమ్మవారి ఘటాలతో తిరువీధి మహోత్సవం జరిగింది. అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు జరిపారు. తిరువీధి అనంతరం గ్రామ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జనం



భామినిలో వినాయకుని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

●**భామిని:** భామినిలోని రాజావీధి, నేరడి, తాలాడ తదితర గ్రామాల్లో బుధవారం వినాయక వి గ్రహాలను నిమజ్జనం చేశారు. ఐదు రోజుల పాటు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆట పాటలతో విగ్రహాలను ఊరేగించి వంశధార నదిలో నిమజ్జనం చేపట్టారు.

●**కురుపాం:** కురుపాంలో వినాయక నవరాత్రోత్సవంలో భాగంగా ఉత్సవాలు పురస్కరించుకుని మహిళలు కోలాటం నిర్వహించారు. ధూళికేశ్వరాలయం నుంచి కోలాటం, నృత్యాలు చేశారు.

●**వీరఘట్టం:** పట్టణంలోని కూరాకులవీధిలోని వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, వివిధ రూపాయల బళ్ల వేషాల ఊరేగించారు. కార్య క్రమానికి వీరఘట్టం మండలంతో పాటు వంగర, జియ్యమ్మవలస మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

● **సీతంపేట:** సీతంపేటలో వర్తక సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం పురస్కరించుకుని బుధవారం అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలోవర్తక సంఘం సభ్యులు దేవరశెట్టి కృష్ణ, భోగి కోటేశ్వరరావు, కందుల సత్యనారాయణ, జామి కేశవరావు, సురేష్, ధనుంజయరావు, గురునాధరావు, పెదబాబు పాల్గొన్నారు.

●**గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం శృంగారపువీధిలో వినాయక మహోత్సవాలు పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు బర్రి మహేష్, చిన్న, సోమేశ్, శంకర్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తోయక కోటేశ్వరరావు, మజ్జి ప్రసాదరావు, తంగుడు కిరణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: ఎంపీడీవో

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు విజృంభించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం మండలంలోని తోటపల్లి, సుంకి, సంతోషపురం పంచాయతీలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టుకు ఆనుకుని పలుగ్రామాల్లో కలుషిత నీరు ఉపయోగించకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రతగా ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వైరల్ జ్వరాలు ఉంటే తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు అందించాలని కోరారు. దోమలు విజృంభించకుండా ఉండేలా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎ.సింహాచలమమ్మ, రామకృష్ణ, ఎ.తవిటి నాయుడు, కె.రవీంద్ర, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్తను తక్షణమే తొలగించాలి

●సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న వ్యర్థాలు, చెత్తను తక్షణమే తరలించాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు.బుధవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని కోరారు. నిరంతరం సంచరించే ప్రాంతాల్లో చెత్తవేయడంతోపౌరులు అనారోగ్యం పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కాదరాము, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సీహెచ్ సంజీవి, వ్యవసాయకార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు పాల్గొన్నారు.

జీవో-85ను ఉపసంహరించుకోవాలి

●గరుగుబిల్లి, భామినిలో వైద్యాధికారుల నిరసన

పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో సీట్లు కేటాయింపు శాతం తగ్గించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం నుంచి దశలవారీగా ఆందోళనకార్యక్రమాన్ని చేపట్టేందుకు వైద్యులు నిర్ణయించారు. ఈ మేరకు గరుగుబిల్లి, భామినిలో వైదులు నిరసన తెలిపారు. జీవో-85ను ఉపసంహరించుకోవాలని కోరారు.

గరుగుబిల్లి:గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు కేకేసాగర్‌వర్మ, ఎస్.సంతోష్ కుమార్ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జీవో- 85 వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని, పీజీలో చదివే అవకాశాలు తగ్గించడం వల్ల నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం అత్యవసర కేసులకు మాత్రమే హాజరుకానున్నామని, 15న చలోవిజయవాడ కార్య క్రామిన్న నిర్వహించనున్నామని తెలిపారు.

●**భామిని:** జీవో -85ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భామిని మండల వైద్యాధికారులు నిరసన తెలిపారు. బత్తిలిలో వైద్యాధికారి రవీంద్ర, బాలేరులో దీపికారాణి, శివకుమార్, భామిని పీహెచ్‌సీలో వైద్యులు వసంతలక్ష్మి, దామోదర, సోహెల్ నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలందించారు.

గణపతికి లక్ష గరిక పూజ

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని ప్రధాన రహదారిలోగల గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో శివగణపతికి బుధవారం లక్ష గరికలతో గణపతికి పూజచేశారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు పలు ఉత్సవ మండపాల్లో గణనాథులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలుచేశారు.



లక్ష గరికలతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు: ఎస్ఐ

గరుగుబిల్లి: పాఠశాలలకు విద్యార్థులను తరలించే ప్రైవేటు బస్సుల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం గొట్టివలసలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరుగుబిల్లి, ఉల్లిభద్ర ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలకు బస్సుల్లో తరలిస్తున్నారని తెలిపారు.నిబంధనల మేరకు బస్సులను నడపకుంటే మోటార్ వెహికల్ చట్టం కింద చర్య తీసుకుంటామని చెప్పారు.

సాలూరు-మక్కువ రోడ్డును నిర్మించాలి

సాలూరు రూరల్: అధ్వాన్నంగా ఉన్న సాలూరు-మక్కువ రోడ్డును తక్షణమే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సీపీఎం సాలూరు మండల కమిటీ సభ్యులతో కలసి బుధవారం రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నాయకులు శ్రీనివాసరావు, జానకీరావు, చినబాబు, అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ఆపాలని చెప్పడం సరికాదు

సాలూరు రూరల్: మండలంలో అభివృద్ధి పనులను ఆపాలని చెప్పడం సరికాదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర తెలిపారు. సాలూరులో పలువురు సర్పంచ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం నిధులిచ్చిందని, ఆ పనులు ప్రస్తుతం సగంలో ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ పనులను అధికారులే కావాలని ఆపితే అంత కన్న విడ్డూరం మరొకటి ఉండదన్నారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పనులు జరిపితే అధికారులకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం

భామిని: విద్యతోపాటు ఆటల్లో కూడా పోటీతత్వం విద్యార్థులకు అవసరమని భామిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటలపోటీలను ప్రారంభించారు. ఖోఖోలో నాలుగు టీమ్‌లకు 44 మంది, వాలీబాల్‌లో 8 టీమ్‌లకు 32 మందికి ఎంపిక చేసినట్టు టీమ్స్ కో-ఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. ఎంపికైన టీమ్‌లు జిల్లా స్థాయిలో ఆడుతారని చెప్పారు. పీఈటీలు స్వర్ణ, కృష్ణకుమారి, శంకరరావు పాల్గొని ఆటలను నిర్వహించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. కొండవీధిలో రెండు సిమెంట్ పలకల కల్వర్టు నిర్మాణం కోసం, పెంకుటిల్లు కాలనీలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం, చింతలగూడ వీధిలో ఉన్న నూకాలమ్మ తల్లి గుడికి సీసీ రోడ్డు నిధులు మంజూరైనట్టు పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుమ్మలక్ష్మీపురం: మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి కుమార్ తెలిపారు. మెయింటినెన్స్ చెట్ల కొమ్మలు కత్తిరింపు వంటి పనులు చేయనుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

సీతంపేట:సీతంపేట ఐటీడీఏపరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు పాఠశాల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. బుధవారం సీతంపేటలోని ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాలికలకు శుక్రవారం, ఈనెల17న క్రీడాఎంపికలు జరుగుతాయని చెప్పారు. 14 నుంచి 17 సంవత్సరాల్లోపు ఉన్న గిరిజన విద్యార్థులు పోటీల్లో హాజరుకావాలని కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గరుగుబిల్లి:గరుగుబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో విలేకరులతోమాట్లాడుతూ ఎంపీపీ ఉరిటిరామారావు అధ్యక్షతన జరిగేసమావేశానికి అధికారులు సమాచారంతో హాజరుకావాలని, సమావేశానికి దిగువస్థాయి సిబ్బందిని పంపించవద్దని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

17న పాలకొండలో జాబ్‌మేళా

పాలకొండ: పాలకొండలో మెగా జాబ్‌మేళాను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. బుధవారం పాలకొండలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులుజాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణాధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

ప్రయాణికుడికి సర్టిఫికెట్లు అందజేత

పాలకొండ: ఓ ప్రయాణికుడు సర్టిఫికెట్లను డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు వి.రాజేష్ అందజేశారు. కొత్తూరు నుంచి పాలకొండకు వచ్చిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు తన సర్టిఫికెట్లను మరిచిపోయాడు. కండక్టర్ సర్టిఫికెట్లను చూసి డిపోమేనేజర్‌కు తెలియజేశారు.తన సర్టిఫికెట్లు పోయాయని, ఆ ప్రయాణికుడు తెలపడంతో విచారణ నిర్వహించి అందజేశారు.

హెచ్‌ఎంకు సన్మానం

పాలకొండ: పట్టణంలోని హడ్కోకాలనీ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల రామలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంతో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అడపా బాబ్జీ, ఇందిరానగర్ కాలనీ యువజనసభ్యులు, ఉపాధ్యాయులు జయమణి, సుధారాణి, రాంబాబు, అరుణకుమారి, రవికుమార్, చంద్రకళ, రమణమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి మైదానాలు ఏర్పాటు చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. రవాణాశాఖ, క్రీడలశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం విజయవాడలో కలిశారు. ఈ సందరంగా క్రీడల అభివృద్ధిపై ఆయనతో ఎమ్మెల్యే చర్చించారు.



రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన విజయచంద్ర